జోరు వర్షం.. పశ్చిమాన హర్షం


మార్కాపురంలో కురుస్తున్న వర్షం

పశ్చిమ ప్రకాశంలో శనివారం వర్షపాతం నమోదు ఇలా..

మండలం	కురిసిన వర్షం (మి.మీ)
మార్కాపురం	27.4
పెద్దారవీడు	10.6
దోర్నాల	2.2
యర్రగొండపాలెం	4.0
త్రిపురాంతకం	4.0
పుల్లలచెరువు	2.8
కంభం	7.2
బేస్తవారపేట	8.6
అర్ధవీడు	0
గిద్దలూరు	16.4
రాచర్ల	13.4
కొమరోలు	41.2
తర్లుపాడు	15.4

- రెండో రోజూ కొనసాగిన వర్షం
- వ్యవసాయ పనులకు రైతన్నలు సంసిద్ధం

మార్కాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలో చల్లదనం అలముకుంది. పలు మండలాల్లో గురువారం రాత్రి నుంచి ప్రారంభమైన వాన శనివారం కూడా ఎడతెరపిలేకుండా కురుస్తోంది. దీంతో పొలాలు పదునెక్కుతున్నాయి. గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకూ ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో జల్లులు కురుస్తున్నాయి. ఈ ఖరీఫ్‌లో అల్పపీడన వలన ఆలస్యంగానైనా వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో పడాల్సిన తొలకరి జల్లులు నెలన్నర తరువాత పలకరించాయి. ఇప్పటికే పొలాల్లో సేద్యం పనులు పూర్తి చేసి విత్తనం నాటేందుకు సిద్ధమైన రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్న నేపథ్యంలో రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముసురు కాస్త తెరపివ్వగానే వివిధ పంటలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో ఖరీఫ్‌లో ఎక్కువగా జొన్న, సజ్జ, కంది, పత్తి, మిరప తదితర పంటలు సాగుచేయడం ఆనవాయితీ. కాగా ఎడతెరపిలేని వానతో మార్కాపురం, తర్లుపాడు, కంభం, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం తదితర పట్టణాలల్లో వీధులు వర్షపునీటితో జలమయమయ్యాయి. బేరాలు లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ రైతులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెమలిగుండం జలాశయానికి నీరుచేరడంతో గుండ్లకమ్మకు నీరు వచ్చే అవకాశం ఉంది. డివిజన్‌లో అత్యధికంగా కొమరోలులో వర్షపాతం నమోదు కాగా.. అర్ధవీడులో చిరుజల్లులు పలకరించాయి.

నాడు ఘనం.. నేడు పేలవం


సచివాలయంలో ఇద్దరు మాత్రమే ఉండి ఖాళీగా ఉన్న ఇతర ఉద్యోగుల కుర్చీలు

గిద్దలూరు రూరల్: గతంలో ప్రతిష్టాత్మకంగా సేవలందించిన సచివాలయాలు నేటి టీడీపీ ప్రభుత్వ పాలనలో పేలవంగా మారాయి. సచివాలయ వ్యవస్థపై పర్యవేక్షణ కొరవడటంతో ఉద్యోగస్తులు కార్యాలయానికి వెళ్లకుండా డుమ్మా కొడుతున్నారు. పట్టణంలోని గణేష్‌నగర్‌లోని సచివాలయంలో ఉద్యోగస్తులు శనివారం ఉదయం 10.30 గంటలైనా సరే విధులకు హాజరు కాలేదు. సచివాలయంలో ప్రధానంగా ఉండాల్సిన అడ్మిన్‌తో పాటు రెవెన్యూ, ప్లానింగ్, శాఖలకు చెందిన అధికారులు కూడా రాలేదు. కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను ఉన్నతాధికారులు పర్యవేక్షించి పాలన గాడిలో పెట్టాని ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రంతో వ్యాధులు


చెత్తను శుభ్రం చేస్తున్న శానిటరీ సిబ్బంది


డస్ట్‌బిన్ నుంచి చెత్తను సేకరిస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్ సెక్రటరీలతో కలిసి శనివారం పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. తమ నివాసాల్లో, ఇంటిపై భాగంలో, పరిసర ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, ఖాళీ కొబ్బరి బోండాలు, ఉపయోగం లేని తొట్లు, కూలర్లు తదితర నిరుపయోగ వస్తువులు ఉంచకూడని హెచ్చరించారు. కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమల ఉత్పత్తి పెరిగి మలేరియా, డెంగీ తదితర వ్యాధులు సంక్రమిస్తాయని హెచ్చరించారు. శానిటేషన్ సెక్రటరీలు రవికుమార్, వెంకటేశ్వర్లు, శానిటరీ మేస్త్రీలు అంజనేయులు, కార్మికులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారానికి సంఘీభావం


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

గిద్దలూరు రూరల్: ఉత్తరప్రదేశ్ నుంచి కాశ్మీరుకు వెళ్లి.. అక్కడ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తున్న శివకిరణ్, సంజయ్‌గిరిలకు ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని బీజేపీ నాయకుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి వారికి శనివారం సంఘీభావం తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావుతో కలిసి మొక్కలు నాటించారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా వారు కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 15000 కిలో మీటర్లు తమ పాదయాత్ర చేశామన్నారు. బీజేపీ నాయకులు గుమ్మా రాముడు, రామాజంనేయులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు సూరె క్రిష్ణారావు, గర్రె సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి కుంకుమార్చన


పూజలు అందుకుంటున్న అమ్మవారు

పొదిలి: అమ్మవారి అనుగ్రహం కోసం సామూహిక కోటి కుంకుమార్చాన పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీ శ్రావణి ఎస్టేట్‌లో శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు శుక్రవారంతో 28వ రోజుకు చేరాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

కౌలు రైతులకు విస్తృత ప్రయోజనాలు


కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కౌలు రైతులు తమ దరఖాస్తులను వీఆర్‌ఓలకు ఇవ్వాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. చింతగుంట్ల, తిప్పాయపాలెం శనివారం కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లోపు కౌలు కార్డులు ఇస్తారని తెలిపారు. పంట నమోదు, పంట నష్టపరిహారం, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు తదితర ప్రయోజనాలు కౌలు రైతుకు వస్తాయన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థుల్లా ఉండాలి

కంభం: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉంటూ నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని పాఠశాలల్లో సౌకర్యాలు, అభివృద్ధి, సమగ్ర విద్యా ప్రణాళికలపై చర్చించారు. విద్యా ప్రవేశ్ ద్వారా కార్యక్రమాలను అమలు చేస్తూ దీక్షా అనువర్తంలో ప్రవేశించాలని, విద్యాశాఖ ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఓ -2 కె.శర్వాణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం బీవీ రామక్రిష్ణ, గని వెంకటేశ్వర్లు, సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కంభం ఎంఈఓ

శ్రీవారికి నైవేద్యాలు


వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


దీక్ష ప్రారంభిస్తున్న సంఘ నాయకులు

పొదిలి: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం జరిగి, అధికారులు పక్షపాత ధోరణి విడనాడేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఓబులేసు చెప్పారు. డిపో ఆవరణలో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. జేఎస్ రాజు ఆధ్వర్యంలో రమేష్, ఎస్.ఎస్.రెడ్డి దీక్షలో కూర్చున్నారు. పద్మ, అరుణకుమారి వారికి దండలు వేసి దీక్షలు ప్రారంభించారు. సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా సత్వర చర్యలు తీసుకోవాలి, కనిగిరి డిపోకు ఎక్సెస్ పేరుతో పంపించిన వారిని వెంటనే మాతృ డిపోకు తీసుకరావాలి, లీవ్ పొజిషన్ ఉద్యోగుల హక్కు మేరకు కల్పించాలన్నారు. డిస్పాచ్ మెకానిక్ కృష్ణ పక్షపాత వైఖరి విడనాడాలి, లేదా అతనిని మార్చాలని డిమాండ్ చేశారు.

జాషువా వర్ధంతి కరపత్రాల ఆవిష్కరణ

దర్శి: గుర్రం జాషువా 53 వ వర్ధంతి కరపత్రాలను డీటీ రవిశంకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ నెల 24వ తేదీన ఎంపీడీఓ ఆలయం ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు హాజరు కావాలని కోరారు. అన్నవరం వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, మోషే, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

25 వరకు గౌతమి అడ్మిషన్లు

దొనకొండ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ఉన్న స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25వ తేదీ వరకు డిగ్రీ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల అడ్మిన్ నాని ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాలలో బీఏ విభాగంలో హిస్టరీ అండ్ ఎకనామిక్స్, బీకామ్ విభాగంలో కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రెగ్యులర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో జాయిన్ కావచ్చని చెప్పారు.

గురుపూర్ణిమకు ఆలయాలు సిద్ధం

దర్శి: గురు పూర్ణిమ, వ్యాసజయంతి పర్వదినం సందర్భంగా మండలంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయాలు పూజాకార్యక్రమాలకు సిద్ధం చేశారు. దర్శి నగర పంచాయతీ పరిదిలోని ప్రసిద్ధి చెందిన శ్రీ నాగ సాయి దత్తాశ్రమం, సాయి కొండ (సాయి హిల్స్) ఆలయంలో ప్రత్యేక పూజలు చేసేందుకు సిద్ధం చేశారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచి సుప్రభాత సేవ, కాగడ హారతి, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, సామూహిక సత్యవ్రతాలు, హారతులు, ఊరేగింపు సేవలు, అఖండ సాయినామ సంకీర్తనలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.